ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 15 | జూలై | 2024
పేజీలు 6

## పువ్వాడ అజయ్‌ను పరామర్శించిన కెటిఆర్



అజయ్ కుమార్‌తో మాట్లాడుతున్న కెటిఆర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆదివారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పరామర్శించారు. ఆరోగ్య వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేటిఆర్ వెంట పలువురు బిఆర్ఎస్ నేతలు ఉన్నారు.

# నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ




**-బాధితులనే బాధించే అవకాశం**
**-కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం**
**-నూతన చట్టాలు.. సమాజంపై ప్రభావం**
**-సెమినార్ లో సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ గత చట్టాలు బ్రిటిష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పన పై దృష్టిసారించిన ప్రభుత్వం కులంకూషంగా చర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని కేవలం 43గంటల 23సెకన్లు మాత్రమే చర్చించారని ఆయన తెలిపారు. పేరు బ్రిటిష్ చట్టాలదే అయినా చట్టాల మార్పు వెనక బిజెపి మార్క్ దాగి ఉందని 10 శాతం గతంలో ఉన్న భారతీయ శిక్షాస్మృతిని మార్చి భారతీయ న్యాయ సంహితను తీసుకు వచ్చారని ఇందులో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని ఆయన తెలిపారు. ఏ తప్పుకు ఏ శిక్ష అన్నది భారతీయ శిక్షాస్మృతి ప్రకారమే తీసుకుని భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక్ సురక్ష సంహిత భారతీయ

మిగతా 2లో..





# ప్రమాదం కాదది.. అవి హత్యలే...

**-అక్రమ సంబంధం నేపథ్యంలో భార్య, బిడ్డలను హతమార్చిన వైద్యుడు**
**-హత్య నేరం నుంచి తప్పించుకునేందుకు ప్రమాదంగా చిత్రీకరణ**
**-వివరాలను వెల్లడించిన ఖమ్మం ఏసిపి రమణమూర్తి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రాణం పోయాల్సిన వైద్యుడు. అక్రమ సంబంధానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలు అడ్డుగా నిలిచారని హతమార్చాడు. తనపై ఎటువంటి నేరారోపణ రాకుండా ఉండేందుకు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు. కానీ భార్య వైపు బంధువుల ఆందోళన, పోలీసుల నిష్పాక్షిక విచారణ ఆ వైద్యుడే హంతకుడని తేల్చేందుకు కారణమైంది. ఆదివారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖమ్మం నగర ఏసిపి ఎస్‌వి రమణమూర్తి ఈ కేసుకు సంబంధించిన

మిగతా 2లో..






న్యూఢిల్లీలో జరుగుతున్న సిపిఐ జాతీయ సమితి సమావేశాల్లో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, హాజరైన సభ్యులు

# ఆరోగ్య భద్రతకే అధిక ప్రాధాన్యత



**-బాధితులకు చెక్కుల పంపిణీ**
**-గ్రామీణ మహిళలతో ముచ్చటించిన పొంగులేటి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల పరిధిలోని 132 మందికి రూ. 3266500 విలువ గల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అనారోగ్య

మిగతా 2లో..

# నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ



**(మొదటిపేజీ తరువాయి)**

సాక్ష్యా సంహిత చట్టాలను తీసుకు వచ్చారని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. పార్లమెంటులో విపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబరు 2023న పార్లమెంటులో 21 డిసెంబరు 2023న రాజ్యసభలో ఆమోదం పొంది 25 డిసెంబరు 2023న గెజిట్ గా రూపొందించబడిందని ఆయన తెలిపారు. ఈ చట్టాల అమలు వల్ల దుష్పరిణామాలను పరిగణలోకి తీసుకో లేదని ఐపిసిలో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో 358కి కుదించారని ఆయన తెలిపారు. 124 ఎ సెక్షన్‌లో గతంలో ఉన్న రాజ ద్రోహం స్థానే దేశ ద్రోహం చట్టాన్ని తీసుకు వచ్చారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్)లోని 153వ సెక్షన్ సోషల్ మీడియాలో ఈ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినా, ప్రచారం నిర్వహించినా దేశ ద్రోహం కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కొన్నింటిలో పోలీసుల జోక్యాన్ని తగ్గించారని ముఖ్యంగా తూనికలు, కొలతలకు సంబంధించి గతంలో పోలీసులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసే వారని కానీ ఇప్పుడు పోలీసులకు అవకాశం లేదని కేవలం ఆ శాఖాధికారులు మాత్రమే తనిఖీలు నిర్వహించనున్నారని తెలిపారు. కొన్ని చట్టాలను కఠినతరం చేశారని గతంలో సాధారణ శిక్షల స్థానే ఇప్పుడు జీవితకాల ఖైదు, మరణ శిక్షను సైతం విధించేవిధంగా చట్టాలను రూపొందించారన్నారు. ఇప్పుడు 16 ఏళ్ల లోపు బాలికపై అత్యాచారం జరిగితే కనీసం 20 ఏళ్లు శిక్షపడే అవకాశం ఉందన్నారు. గతంలో జీవిత ఖైదు అంటే కొన్నేళ్లకు పరిమితమయ్యేదని కానీ ఇప్పుడు సహజ సిద్ధమైన జీవితం ఉన్నంత కాలం ఖైదు విధించే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలు ఒకటి జూలై 2024 నుంచి అమల్లోకి వచ్చిన గతంలో ఐపిసి ప్రకారం నమోదైన కేసులను ఆ సెక్షన్ల ద్వారానే విచారిస్తారని పాత కేసులు పూర్తయ్యే వరకు కొత్త, పాత చట్టాలతో పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఫోక్సో లాంటి కేసుల్లో బాధితురాలి పేరును కానీ, కుటుంబ పేరును కానీ విచారణ పూర్తయ్యేంత వరకు బహిర్గత పర్చరాదని పోలీసులు సైతం వివరాలు సీల్డ్ కవర్‌లో న్యాయమూర్తికి అందించి పేరుకు బదులు బాధితురాలి పేరును వాడాల్సి ఉంటుందని విద్యా సాగర్‌రెడ్డి సూచించారు. మీడియా సైతం బాధితురాలి పేరును ఉచ్చరిస్తే శిక్షించే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతంలో ఉన్న చట్టాలను ఇప్పుడు తీవ్రతరం చేశారని ఢీకొట్టి పారిపోవడం లాంటివి చేస్తే పదేళ్ల వరకు శిక్ష ఉండే అవకాశం ఉందని నాన్‌బెయిలబుల్ కేసులు 102 (2) బిఎన్‌ఎస్ ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయవచ్చునన్నారు. ప్రభుత్వాల పట్ల కానీ, ప్రజాప్రతినిధుల పట్ల కానీ దురుసుగా ప్రవర్తించడం, అడ్డుకోవడం లేదా బెదిరింపులకు పాల్పడడం ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం లాంటి వాటిని నేరాలుగా పరిగణించి ప్రస్తుత నూతన చట్టాలలో శిక్షను ఖరారు చేశారని ఆయన తెలిపారు. కొన్ని సెక్షన్లలో పోలీసులకు విపరీతమైన అధికారాలు ఇచ్చారని గతంలో రెవెన్యూ అనుమతితో కూడిన చట్టాలు అమలయ్యే అవకాశం ఉండగా ఇప్పుడు పోలీసులే నేరుగా చట్టాన్ని అమలు చేసే అవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఇది ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమేనన్నారు. గతంలో హత్యాయత్నం కేసుకు సంబంధించి నేరం జరిగిన తీరును బట్టి జీవిత ఖైదు లేదా పదేళ్లు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అన్నింటికి మించి మోడీ, అమిత్ షాలను మాత్రమే సంప్రదించి ఈ చట్టాలను అమలు చేశారని ఇందులో న్యాయ నిపుణులను కానీ బార్ కౌన్సిల్స్‌ను కానీ పరిగణలోకి తీసుకోలేదన్నారు. కలెక్టర్ కొన్ని కేసులకు సంబంధించి స్పెషల్ ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్‌ను నియమించే అవకాశం ఉందని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఇది అధికార దుర్వినియోగానికి అవకాశం ఇస్తుందని ఆయన తెలిపారు. భారతీయ సాక్ష్యా సంహితలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటున్నారని మారిన పరిస్థితుల్లో ఇది దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని మార్ఫింగ్ జరగడం ద్వారా నిందితులు తప్పించుకోవడం లేదా నేరస్తులు కానీ వారిని నేరస్తులుగా నిరూపించే అవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహిళలపై దాడులకు సంబంధించి పోలీసులు అప్పటికప్పుడు ఎఫ్‌ఐఆర్ చేయకుండా 14 రోజుల పాటు కాలయాపన ను ఉన్నతాధికారి అనుమతితో చేసే అవకాశం ఉందని దీని వల్ల కొన్ని సందర్భాలలో కేసులు తారుమారు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గతంలో ఓ కేసు నమోదైనప్పుడు అప్పుడు బాధ్యతల్లో ఉన్న అధికారి మాత్రమే కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆ స్థానంలో వచ్చిన అధికారులు ఎవరైనా సాక్ష్యం చెప్పే వెసులుబాటు కల్పించారని దీని వల్ల తీర్పుల్లో న్యాయం జరగక పోవచ్చునని ఆయన అన్నారు. ఈ సెమినార్‌లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణ కుమార్, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఎఎల్ నాయకులు పట్టాభి, ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు శింగు నర్సింహారావు, ప్రముఖ న్యాయవాది ఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రమాదం కాదది.. అవి హత్యలే...

**(మొదటిపేజీ తరువాయి)**

పూర్తి వివరాలను, నేరం జరిగిన తీరును వివరించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని బావోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లో జర్మన్ టెన్ ఆసుపత్రిలో మత్తు వైద్యునిగా పని చేస్తున్నాడు. అతనికి ఏన్కూరు మండలం రంగాపురం తండాకు చెందిన కుమారి తో వివాహమైంది. వీరికి కృషిక, కృతిక అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రవీణ్ తాను పనిచేస్తున్న ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సోని ఫ్రాన్సిస్ అనే ఆమెతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. భార్య కుమారి పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించడం, హింసించడం చేస్తుండడంతో పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. శాశ్వతంగా వదిలించుకోవాలనుకున్న ప్రవీణ్ తన ప్రణాళికను అమలు చేసేందుకు భార్య, బిడ్డలతో ఖమ్మం వచ్చాడు. మే 17న ఖమ్మం వచ్చిన ప్రవీణ్ మే 28న తనతో పాటు భార్య, పిల్లలను తీసుకుని ఉదయం ఖమ్మం వచ్చాడు. ఖమ్మంలో పని చూసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో భార్య తనకు శరీరంలో వేడిగా ఉందని చెప్పడంతో జ్యూస్ తాగుదామని ఆపి చెరుకు రసం తాపించిన తర్వాత తన వద్ద కాల్షియం ఇంజక్షన్ ఉందని అది ఇస్తే త్వరగా తగ్గిపోతుందని భార్య కుమారికి ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి కారును కోయచలక రోడ్డుకు తిప్పి మరింత ఉపశమనం కోసం మరో ఇంజక్షన్ చేస్తానంటూ పరిమితికి మించిన డ్రగ్స్‌ను శరీరంలోకి ఇండెక్ట్ చేశాడు. దీంతో భార్య కుమారి మరణించింది. ఆమె మరణించిందని ధృవీకరించుకున్న తర్వాత తన కుమార్తెలైన కృషిక, కృతిక లను గొంతు నులిమి ఒకరి తర్వాత ఒకరిని హత్య చేశాడు. మూడు మృతదేహాలను కారులో వేసుకుని మంచుకొండ హర్యాతండా గ్రామ సమీపంలోని పొలంలోకి కారును తిప్పి చెట్టుకు గుద్ది ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ప్రమాదంలో భార్య, బిడ్డలు చనిపోయారని తనకు గాయాలు అయ్యాయని బంధు వర్గాన్ని, పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అల్లుని ప్రవర్తన, గతంలో జరిగిన ఘటనలను పోల్చుకుని భార్య కుమారి వైపు బంధువులు ఇది ప్రమాదం కాదని హత్యే అంటూ మే 29న ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. శవ పంచనామ తర్వాత పూర్తి వివరాలు వస్తాయని పోలీసులు తెలపడంతో ఆందోళన విరమించారు. తర్వాత రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ వద్ద కూడా మృతులకు న్యాయం చేయాలని ప్రవీణ్‌ను కఠినంగా శిక్షించాలని ఆందోళన చేశారు. ఖమ్మం సిపి సునీల్ దత్ ఆదేశాలతో ఏసిపి రమణమూర్తి నేతృత్వంలో సిఐ శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ఈ కేసును చేధించారు. నిందితున్ని మీడియా ఎదుట హాజరు పర్చారు. ముగ్గురి హత్యకు పాల్పడిన ప్రవీణ్ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరును పలువురు అభినందించారు.

# ఆరోగ్య భద్రతకే అధిక ప్రాధాన్యత

**(మొదటిపేజీ తరువాయి)**



కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఎల్‌వోసిల ద్వారా 120 మంది అనారోగ్య బాధితులకు కోటి రూపాయలకు పైగా ఇప్పించడం జరిగిందన్నారు. పాలేరు నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వెళుతూ మధ్యలో వ్యవసాయ పనులు చేస్తున్న మహిళలతో ఆయన ముచ్చటించారు. రైతు భరోసా పథకం పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలంలో కొండాపురం, ఆరెంపుల సహా పలు గ్రామాల్లో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. గూడూరుపాడులో ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిఎంఅండ్‌హెచ్‌వో మాలతి, ఆర్డివో గణేష్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీను కుటుంబానికి అండగా ఆయన సహచరులు

### రూ. 25 లక్షల చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డ అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కుటుంబానికి ఆయన సహచరులు అండగా నిలిచారు. భర్తను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న ఆ కుటుంబానికి తాము ఉన్నమంటూ మానవత్వాన్ని చాటుకున్నారు శ్రీను సహచరులు. ఎస్‌ఐ స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా నారక్కపేట లో ఎస్‌ఐ సతీమణికి 2014 ఏపి, తెలంగాణ ఎస్‌ఐ వెల్ఫేర్ బ్యాచ్‌మెట్స్ ఆధ్వర్యంలో రూ. 25 లక్షల చెక్కును అందజేశారు. ఆ కుటుంబానికి అండగా నిలిచిన వీరిని పలువురు అభినందించారు.

## గుండెపోటుతో మున్సిపల్ ఆర్ఐ మృతి

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాలిటీలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రాము ఆదివారం గుండెపోటుతో మరణించాడు. అంకిత భావంతో పని చేసే రాము మరణించడం పట్ల పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం మధిర మున్సిపాలిటీకి తీరని లోటన్నారు. రాము మరణం పట్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ మొండితోక లలిత తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఖమ్మం కార్పోరేషన్‌లో హెల్ఫ్ లైన్ ఏర్పాటు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ నందు ఎమర్జెన్సీ హెల్ఫ్ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. రానున్న వారం రోజులు అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఖమ్మం కార్పోరేషన్ నందు ఎమర్జెన్సీ హెల్ఫ్ లైన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్న యెడల 7901298265 నెంబర్‌కు కాల్ చేసి సహాయాన్ని పొందవచ్చునని తెలిపారు.

## పీర్లతో ముస్లిం సోదరులు ఊరేగింపు



**ప్రజాపక్షం/ తల్లాడ :** మొహర్రం పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులు పీర్లతో ఊరేగింపు ఆదివారం నిర్వహించారు. తల్లాడలోని పాత తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నూతన పీర్ల సావిడి దర్గా వద్ద వారం రోజులుగా మొహర్రం సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ముస్లిం మత పెద్దలు, యువకులు, మహిళలు పీర్లను చేతబూని పట్టణ పురవీధుల్లో మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, కేరింతల నడుమ ఊరేగించారు. అనంతరం దర్గా వద్ద హోమగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పీర్ల ముజాఫర్ షేక్, ఇసూబ్, ఆలయ కమిటీ సభ్యులు షేక్ మొహారాజ్, చంద్‌పాషా, యాకూబ్ పాషా, బడేమియా, నన్నేసాహెబ్, బారెల్లి, బాబు, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాసవీ గార్డెన్స్ అధ్యక్షులు చెరుకూరి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం వాసవీ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ కన్యకాపరమేశ్వరి ఆర్య వైశ్య అన్న సత్రం ట్రస్టు కమిటీ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ విద్యా పథకంలో భాగంగా 120 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెరుకూరి కృష్ణమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు లు మాట్లాడుతూ గత మూడేళ్లుగా వాసవీ విద్యా పథకం ద్వారా అర్హులైన పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు వారు సూచించారు. దీనికి ట్రస్టు కమిటీ సభ్యులు సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి కురువెళ్ల లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులు కడివెండి శ్రీనివాస్, పసుమర్తి సాంబశివరావు, వేములపల్లి నగేష్, ఈశ్వరరావు, ముత్తయ్య, కాంతారావు, హన్మంతరావు, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాసరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## – వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్





**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి నదికి వరద నీరు వచ్చి చేరుతున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం భద్రాచలంలో గోదావరి వరద ముంపుకు గురయ్యే పలు కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదికి వరద పెద్ద ఎత్తున వస్తే ముంపుకు గురయ్యే కాలనీల వారు పునరావాసకేంద్రాలకు తరలిపోవాలని, అందుకు అధికారులు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. పట్టణంలోని పలు కాలనీల్లో వరద నీరు ప్రవేశించకుండా ఇప్పటి నుండే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విస్తా కాంప్లెక్స్ సమీపంలో గల మోటార్లను పరిశీలించారు. గోదావరి వరద పరిస్థితిని బట్టి సిడబ్ల్యూసి, మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రత్యేకంగా అమర్చిన మోటర్లా ద్వారా నీటికి గోదావరిలోనికి చకచకా వదిలేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి అదనపు మోటార్లు తెప్పించుకోవాలని సూచించారు. గోదావరి వరదలకు గురయ్యేగ్రామాలకు సంబంధించిన సెక్టోరియల్ అధికారులు ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వర్షపు నీరు రోడ్లపైకి వస్తుందని, గ్రామపంచాయితీ వారు డ్రైన్లు శుభ్రం చేయాలన్నారు. అనంతరం కూనవరం రోడ్‌లో నూతనంగా నిర్మించే కరకట్ట పనులను పరిశీలించారు. వరద నీరు పెరగక ముందే కరకట్ట పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణం తడిచెత్త, పొడిచెత్త నిర్మాణం చేపట్టే డంపింగ్ యార్డును పరిశీలించారు. పలు ప్రాంతాల నుండే వేలాది మంది భక్తులు వస్తుంటారని, వీరితో పాటు పట్టణ ప్రజలు పడేసే చెత్తా చెదారాన్ని గ్రామపంచాయితీ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతీ రోజూ పట్టణాన్ని శుభ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ రాంప్రసాద్, తహశిల్దార్ శ్రీనివాసరావు, గ్రామపంచాయితీ ఇఓ శ్రీనివాసరావు, ఆర్ఐ నర్సింహారావుతో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మంత్రి తనయుడు తుమ్మల యుగంధర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం నియోజక వర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పాటించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అన్ని శాఖల్లో తప్పక పాటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల జాతీయ అధ్యక్షులు పివి రమణ తెలిపారు. ఖమ్మం నగరంలోని బంజార భవన్ నందు ఏఐఎస్‌టివిఏ జిల్లా నాయకులు గరికె శ్రీనివాసరావు అధ్యక్షతన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు పివి రమణ పాల్గొని మాట్లాడుతూ అన్ని శాఖల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ తప్పక పాటించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ కన్వర్ట్ పాఠశాలల్లో టీచర్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. డైలీవేజ్ వర్కర్లను, సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు భూక్యా వీరభద్రం, పుట్టబంతి బాలస్వామి, భూక్యా శోభన్, రాంప్రసాద్, డా॥ శంకర్, శివకోటి, శ్రీను, వీరన్న, శ్రీనివాస్, రఘు, ముత్తయ్య, మంగీలాల్, సాంబశివరావు, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ సేన సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఈనెల 22న జరిగే సేవాలాల్ సేన సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ మా తండాలో మా రాజ్యం కావాలని గిరిజనులకు అన్ని రంగాలలో జనాభా దామాషా ప్రకారం వాటా ఇవ్వాలని సేవాలాల్ సేన పోరాటం సాగిస్తుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకు జఠిలమైపోతుంటే పాలకులు చోద్యం చూస్తున్నారు తప్ప పరిష్కారం చూపడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 22న సోమవారం ఇల్లందు క్రాస్ రోడ్డులోని టిటిడిసి నందు సేవాలాల్ సేన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బానోత్ శ్రీకాంత్, నాయకులు రాజ్‌కుమార్, పృథ్వీనాయక్, బాబూ నాయక్, కుమార్ నాయక్, శ్రీను నాయక్, దేవేందర్ పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ దయాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకులు అంబటి సుబ్బారావు, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అంబటి ఈశ్వర్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి వృద్ధులకు అందజేసి మాట్లాడారు...టైర్లు,ప్లాస్టిక్ డబ్బాలతో పాటు నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెంది, అనారోగ్యానికి గురిచేస్తాయన్నారు. కావున వాటిని తొలగించడంతో పాటు ఇంటి పరిశర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ,వైద్యశాఖలు నిత్యం గ్రామాల్లో పర్యటించి, ప్రజలను చైతన్య పరచడంతో పాటు వారి సేవలను అందించాలని సూచించారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన తండ్రి,కుమారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్లపూడి వెంకటేశ్వర్లు, సప్పిడి ప్రభాకర్, పోతుల ప్రసాద్, సలవది రాజేష్, గొడ్డుగొర్ల గురవయ్య, షేక్ నాగులమీరా, అంబటి ఉపేందర్, షేక్ చంద్‌పాషా, షేక్ మస్తాన్, షేక్ ఠాగూర్, గుంతేటి నాగరాజు, గుడిబండ్ల సతీష్, గొడ్డుగొర్ల రమణయ్య, ఐతగాని ప్రవీణ్, అబ్బూరి సుదీర్, సిరిపురపు గోపి, కందుల పవన్, కామ భాస్కర్, కొప్పుల నవీన్, బొందల సాయి, సురేష్, జ్ఞానేష్, జీవిన్, చంటి, గోపి, తూమాటి త్రినాథ్, బోల్లెద్దు రాము, తోట రాంప్రసాద్, కందుల సాయి, గుత్తికొండ రవి, పవన్, ఠాగూర్, లక్ష్మన్‌పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వైరా:** గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సొంత భవనాలు లేక సౌకర్యాలు సక్రమంగా లేక విద్యార్థులు, పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారని సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రివర్గం గురుకుల విద్యా సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వైరా నియోజకవర్గ ఇంచార్జి భూక్యా వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వైరా మండల పరిధిలోని రెబ్బవరంలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను సిపిఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తూము సుధాకర్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్‌తో కలిసి సందర్శించారు. 750 మంది బాలికలు ఉన్నా సొంత భవనం లేక సమస్యలు తాండవిస్తున్నాయని, త్రాగునీరు, ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ చెడిపోయే 6 నెలలు అవుతున్న ఇప్పటివరకు మరమ్మత్తులు చేయడం లేదని, వెంటనే అధికారులు వాటర్ ప్లాంట్ బాగు చేసి విద్యార్థులకు మంచినీరు అందించాలని భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సన్నబియ్యం సరఫరా చేయాలని, స్థానిక వైరా తహశీల్దార్‌ను కోరారు. వీధిలైట్లు లేక రాత్రిపూట పురుగులు, పాములు వస్తున్నాయని విద్యార్థులు తెలపగా వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ భూక్యా వీరభద్రం ఫోన్ చేసి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రెండు రోజులు ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి హామీ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని, జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ మాలతి ఫోన్ ద్వారా త్వరగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న గురుకుల పాఠశాల సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణ చేయాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆషాడం బోనాలు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల శ్రీసాయిబృందావన్, ఆటోనగర్ కాలనీలలో మైసమ్మతల్లికి ఆషాడ బోనాలను కాలనీవాసులు ఆదివారం ఘనంగా సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై ఊరేగింపులో అమ్మవారిని ఎత్తుకున్నారు. అలాగే సీఐ రాజిరెడ్డి ఈ వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత మహిళలంతా ఒక్క దగ్గర చేరి బోనాలతో పురవీధుల్లో కలియతిరిగారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దండి రంగారావు, కాలనీ వాసులు తక్కెలపల్లి శ్రీనివాస్, కిరణ్, ఎన్సిసి శ్రీను, సాయి, భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతిలో తప్పలను సరిచేయించుకోండి

**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు గృహజ్యోతి పథకానికి అర్హులుగా ఉండి పథకం అందని వారు మండల అభివృద్ధి కార్యాలయం సింగరేణి కార్యాలయానికి వచ్చి సరి చేసుకోగలరని కాంగ్రేస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు అన్నారు. కారేపల్లి మండలంలో ఉన్న అన్ని గారమాలకు ఆరు గ్యారంటీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం అందరికి తెలిసిందే. ప్రజాపాలన దరఖాస్తులు తప్పుడు దొర్లి కొంతమంది గృహజ్యోతి పథకానికి అర్హులైన వారికి పథకం అందడంల ఏదని విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మరల ఎడిట్ ఆప్షన్‌ను నేటి నుండి విడుదల చేసింది. ప్రజాపాలన దరఖాస్తులో కరెంటు మీటర్ నెంబర్ ఒకరి నెంబర్ బదులుగా ఇంకొకరికి తప్పుగా నేమోదైన దరఖాస్తులు వివరాలు సరి చేసుకునే విధంగా అవకాశం కల్పించింది అని కాంగ్రేస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఓ ప్రకటనలో విడుదల చేశారు. మండల పరిధిలో అర్హులైన పథకం అందని వారు నేటి నుండి మండల అభివృద్ధి కార్యాలయానికి వచ్చి సరి చేసుకొని పథకం పొందాల్సిందిగా కోరారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 108 వాహనాన్ని మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండల ప్రజా ఆరోగ్య సమస్యలపై బాధపడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి రావడంతో 108 వాహనాన్ని సిఎస్ఆర్ నిధులతో మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కి సింగరేణి మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 30 పడకల ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేయడం కోసం ఎంతో కృషి చేస్తున్నారని, నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యలపై ఎటువంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కారం కోసం తన వద్దకు వచ్చినటువంటి ప్రతి సమస్యను పరిష్కరిస్తూ ప్రజా మన్ననలను పొందుతున్నప్పటి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కి సింగరేణి మండల నాయకులు, ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కల్లూరు మండలంలో జోరుగా సన్నాల సాగు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో వానాకాలం సాగులో సాగు రైతులు ఆసక్తితో కొనసాగిస్తున్నారు. మండలంలో వ్యవసాయ విద్యుత్ బోర్లు, నేల బావులు ఆయకట్టు పరిధిలో రైతులు సన్నాలు సాగుపై ఆసక్తితో సాగుతో ముందుకు పోతున్నారు. బిపిటి 52 04 ,హెచ్‌ఎంటి 12 24, సాగును మండల పరిధిలోని ముచ్చవరం, చిన్న కోరుకొండి, కల్లూరు, పెద్ద కోరుకొండి, లింగాల, పేరువంచ, ఎర్రబోయినపల్లి, చెన్నూరు తదితర గ్రామాలలో సన్నాల సాగుపై రైతులు ఆసక్తితో వానాకాలం వరి పంటగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలలో నాట్లు వేయడం, కరివేద పద్ధతులో జల్లటం చేసి పంటను కొనసాగిస్తున్నారు.

## ఎస్సీ కులాల రిజర్వేషన్‌ను 20శాతం పెంచాలని వినతి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన ఆదివారం చేసిన సందర్భంగా షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, కొత్తగూడెం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పలు విషయాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలన సౌలభ్యం కోసం ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో సగం భూభాగం వెనుకబడ్డ ఏజెన్సీ బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మయాంలో తొలగించిన స్థానిక ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ తిరిగి అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎస్సీ కులాల జనాభా పెరిగినందున ఎస్సీ కులాల రిజర్వేషన్ 20% పెంచి ఎస్సీ కులాల విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ పరంగా ఆదుకోవాలని కోరారు. ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యంలో ఎస్సీ కులాల అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసి కోకన్వీనర్ రజనీర్, అంబేద్కర్ కమిటీ సభ్యులు కండె రాములు, సలిగంటి కొమరయ్య, ఏలేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ ధాన్యం.. మిల్లర్లకు రికవరీ భయం..!

- కొన్ని మిల్లులలో ధాన్యం మాయం..?
- 100% రికవరీ చర్యలు
- జిల్లాలో 70% ధాన్యం రికవరీ
- 30% ధాన్యం సరఫరా సంగతేంటి..?





**ప్రజాపక్షం/వైరాః** సివిల్ సప్లై శాఖ ద్వారా సిఎంఆర్ ధాన్యం తీసుకొని ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయని రైస్ మిల్లర్లపై సివిల్‌సప్లై అధికారులు ధాన్యం రికవరీ చేయడంలో స్పీడ్ పెంచారు. ఖమ్మం జిల్లాలో సుమారు 62 మిల్లులకు 12లక్షల క్వింటాళ్ళ ధాన్యం సివిల్‌సప్లై శాఖ ద్వారా తీసుకొని ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 70% ధాన్యం బియ్యం రూపంలో రికవరీ అయినట్లు సమాచారం. 30% ధాన్యం రికవరీ కోసం సివిల్‌సప్లై అధికారులు ముమ్మరంగా ఒత్తిడి పెంచారు. కోట్లాది రూపాయల విలువ చేసే ధాన్యాన్ని ప్రభుత్వం నుండి సిఎంఆర్‌గా పొందిన కొన్ని మిల్లుల్లో ధాన్యం సివిల్‌సప్లై నుండి ధాన్యం పొందిన మిల్లర్లు మరికొందరికి విక్రయించడంతో పాటు సొమ్ము చేసుకున్నట్లు ప్రచారం కూడా జరుగుతుంది. ఖమ్మం జిల్లాలో 202324 సంవత్సరం ధాన్యం తీసుకున్న మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అందించడంలో 30% మిల్లర్లు ధాన్యం సరఫరా చేయలేదు. కొన్ని మిల్లుల్లో ధాన్యం మాయమైన ఆరోపణలు లేకపోలేదు. కొంతమంది ధాన్యం మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకొని ఆ డబ్బుతో ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కొంతమంది మ్లిర్లు రాజకీయ అండదండలతో ధాన్యాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణలు లేకపోలేదు. సిఎంఆర్ ధాన్యం రికవరీపై ఇటీవల సివిల్‌సప్లై కమీషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎవరైతే ప్రభుత్వం వద్ద నుండి మిల్లర్లు ధాన్యం తీసుకున్న వారిలో రికవరీ చేయని వారు వద్దకు వెళ్లి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఎందుకు ఇవ్వలేదు. దానికి సంబంధించిన వివరాలు స్వీకరించ రికవరీ చేయాలి. మిల్లుల్లో ధాన్యం లేకపోతే ఆస్తులు జప్తు చేయాలని కమీషనర్ తెలిపినట్లు సమాచారం. కొంతమంది మిల్లర్లు ప్రభుత్వం వద్ద నుంచి తీసుకున్న ధాన్యాన్ని పక్కదావ పట్టించి చౌక దుకాణాల వద్ద నుండి దళారుల వద్ద నుండి తీసుకున్న రేషన్ బియ్యాన్ని రీ పాలిష్ చేసి అప్పగిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుండి సిఎంఆర్ ధాన్యం తీసుకొని బియ్యాన్ని సరఫరా చేయాల్సిన రైస్ మిల్లర్లు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ధాన్యం నిల్వలపై విజిలెన్స్ సివిల్‌సప్లై, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఏర్పాటు చేసినట్లుగా సమాచారం. సిఎంఆర్ ధాన్యం రికవరీ విషయంలో ఎప్పటికప్పుడు తనిఖీలు పూర్తిస్థాయిలో చేసి మిల్లర్ల ముందే హెచ్చరించి ఉంటే పూర్తిస్థాయిలో రికవరీ అయ్యేవి.


### అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లు...?

సిఎంఆర్ ధాన్యం సరఫరాలో ప్రభుత్వ విధానంలోని కొన్ని లొసుగుల ఆసరాగా చేసుకొని మిల్లర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకొని జలసాలతో పాటు ఇతర వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. కొంతమంది వ్యాపారులు ధాన్యం రికవరీ చేయకుండా వారి ఆస్తులు బినామీయుల పేరుతో కూడా పెట్టుకుంటున్నట్లు సమాచారం. కాని రికవరీందుకు అధికారులు మిల్లులు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిఎంఆర్ ధాన్యం వ్యవహారంలొఓ అక్రమాలు జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎవరికతైఏ సిఎంఆర్ ధాన్యం సరఫరా చేస్తున్నామో వారి నుండి సూరిటీ తీసుకుంటే మంచిది ధాన్యం తీసుకున్న తర్వాత ఏ తేది వరకు బియ్యాన్ని సరఫరా చేస్తారో ఆ డేట్‌ను కచ్చితంగా బాండ్ పేపర్‌పై తీసుకోవాల్సి ఉంటుంది. కట్ ఆఫ్ కట్ తేదీలోపు ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయని మిల్లర్లపై పెనాల్టీలు విధించాల్సి ఉంది. ఎవరైతే ప్రభుత్వానికి ధాన్యం విషయంలో బియ్యం సరఫరా చేయాలో అలాంటి మిల్లులను సీజ్ చేసి ట్రేడింగ్ లైసెన్స్ రద్దు చేయాలి. కొంతమంది మిల్లులను లీజుకు తీసుకొని ధాన్యాన్ని మాయం చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో సిఎంఆర్ ధాన్యం రికవరీలో మిగిలిన 30% రికవరీని తొందరగా చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఈ రోడ్లపై నిర్లక్ష్యం ఎందుకు..?



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**ప్రజాపక్షం/వైరాః** ప్రభుత్వాలు మారుతున్నా ప్రజాప్రతినిధులు మారుతున్న వైరా మున్సిపాలిటీలో ఎంతో కీలకమైన ఈ రెండు రోడ్లను పట్టించుకునే నాధుడే కనిపించడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్త బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ నుండి వాసవి థియేటర్ వరకు, పాత బస్టాండ్‌లోని వాసవి కళ్యాణ మండపం ప్రక్కన నుండి శ్రీనికేతన్ పాఠశాల వరకు ఉన్న ఈ రోడ్లు ఎంతో కీలకమయ్యాయని, వైరా మున్సిపాలిటీ అంటే ప్రథమంగా గుర్తొచ్చేది ఈ రెండు రోడ్లే. ఈ రెండు రోడ్లు నిత్యం ఎంతో పెద్దెత్తున ప్రజలు వాహనదారులు తిరుగుతూ ఉంటారు. ఇలాంటి రద్దీగా ఉండే రోడ్లను ఎందుకు పట్టించుకోవడం లేదు అనేది ఇప్పుడు ప్రతినోట ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం వస్తే పాత కూరగాయల మార్కెట్‌లోని రోడ్డు వాసవి కళ్యాణ మండపంలోని రోడ్డు ఈ రెండు రోడ్లు ప్రజలు నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వేయక డ్రైనేజీ చేపట్టక చిన్నపాటి వర్షం వస్తే రోడ్లపై నీరు నిలబడుతుంది. అలాంటప్పుడు ఆ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు ఎంత ఇబ్బంది పడతారు ఆలోచించండి. రోడ్లకు నిధులు మంజూరు రూ.30కోట్లు నిధులు మంజూరు చేసినప్పుడు కూడా ఈ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. మున్సిపాలిటీ ప్రతి సమావేశంలో ఈ రెండు రోడ్లు గురించి ఎక్కడ నిధులు కేటాయించిన సందర్భాలు కనిపిచండం లేదు. కేవలం మాటలకే పరిమితమైన అవి తప్ప కీలకమైన ఈ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలు పడితే వాసవి మండపం నుండి శ్రీనికేతణ్ స్కూల్ వరకు నీరు డ్రైనేజీలు సరిగా లేక రోడ్లపై నీరు నిలిచి నడవాలంటేనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ఇళ్ళలో కూడా నీరు వచ్చిన పరిస్థితి అక్కడ ఉంది. ఏది ఏమైనా మున్సిపాలిటీలో కీలకంగా ఉన్న పాత కూరగాయల మార్కెట్ రోడ్డు వాసవి కళ్యాణ మండపం ప్రక్కన రోడ్డు ఈ రెండు రోడ్లను నిర్మాణ పనులు చేపట్టి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# డ్రగ్స్ విద్యార్థుల దరిచేరకుండా ప్రహరీ క్లబ్‌లు..!





**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** విద్యార్థులు మాదక ద్రవ్యాలు మత్తు, పదార్ధాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్లబ్‌లకు అనుమతి ఇస్తూ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బీ.వెంకటేశం ఉత్తర్వలు జారీ చేశారు. విద్యార్థులను డ్రగ్స్ కు దూరంగా ఉంచటం, పాఠశాలలో పరిసరాలలో వాటి లభ్యత స్మగ్లింగ్, విక్రయాలు లేకుండా చూడటం ఈ క్లబ్‌ల ఉద్దేశ్యం. జిల్లాలోని ప్రభుత్వ, ప్రవేట్ ఉన్నత పాఠశాలలో క్లబ్ లు ఏర్పాటు చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ నిరోధానికి తమకు అనుకూలమైన వ్యూహాత్మక పద్ధతులు రూపొందించుకోవాలని పేర్కొంది. డ్రగ్స్ కు దగ్గరవుతున్నా పిల్లల పై ఈ క్లబ్ సభ్యులు అప్రమతంగా ఉండాలని వారికి అవగాహన కల్పించాలని తెలిపింది. మాదక ద్రవ్యాలు,మత్తు పదార్ధాలు రవాణాలో ఇరుక్కున్న పిల్లలను రక్షించాలని పాఠశాల పరిసరాలలో వాటి స్మగ్లింగ్ అమ్మకాల పై నిఘా పెట్టాలని సూచించింది.

### క్లబ్ లో ఎవరెవరు అంటే...

విద్యార్థుల కోసం ఏర్పాటు చేసే ఈ క్లబ్ కు అధ్యక్షుడు గా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా ఉంటారు. ఉపాధ్యాక్షుడు గా సీనియర్ ఉపాధ్యాయులు, ఉండాలని ఉత్తర్వలో పేర్కొంది. అదేవిధంగా 6 నుంచి 10 వరకు ఒక్కో తరగతి కి ఇద్దరు చొప్పున చురుకైన విద్యార్థులను, సభ్యులు గా చేర్చాలని సూచించారు. అంతే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం నుంచి ఒక్కో ప్రతినిధి ని చేర్చాలని ఆదేశాలు జారీ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ఒక పోలీసు ను కూడ తీసుకోవాలని సూచించింది. పట్టణంలోనే కాకుండా మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలో కూడ క్లబ్ లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అదేశించింది.

### పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నాం : తోట నాగరాజు, ఎస్సై, నేలకొండపల్లి.

ప్రభుత్వ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, సైబర్ నేరాల పై అవగాహన కల్పిస్తున్నాం. కొత్తగా పాఠశాలలో ప్రహరీ క్లబ్ లు మరింత తోడ్పాటు అందిస్తాయి. విద్యార్థుల జీవితాలు నాశనం కాకుండా మాదక ద్రవ్యాలు, మత్తు పదార్ధాల కు దూరంగా ఉండేలా వారికి తెలియజేయాలి. ప్రభుత్వం తీసుకున్న క్లబ్ ల ఏర్పాట్లు చాలా సంతోషం. విద్యార్థులకు మంచి జరుగుతుంది.

### క్లబ్ ఉద్ధేశ్యం చాలా మంచింది : మేకల వెంకటేశ్వర్లు, కోనాయిగూడెం,



తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల స్తాయిలో కల్బ్ లు ఏర్పాటు చేయాలని ఆలోచన చాలా మంచింది. విద్యార్థులు ఆ వైపు అడుగులు వేయకుండా క్లబ్ చూసుకునేలా ముందుకు సాగాలి. క్లబ్ ఉద్ధేశ్యం ఏర్పాట్లు పట్ల ప్రభుత్వం కు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ ల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి.

### విద్యార్థులకు చాలా ఉపయోగం : ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి. ఖమ్మం.



తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రహారీ క్లబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. విద్యార్థులు తెలిసీ తెలియక చెడు అలవాట్లు చేసుకుంటున్నారు. వారిని చైతన్యం చేసే బాధ్యత క్లబ్ చేపట్టాలి. క్లబ్ లో విద్యార్ధి సంఘాలను కూడ చేర్చిచే మరింత సేవలు అందించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.

# కల్లూరులో రేషన్ దందా..!



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో రేషన్ డీలర్ల వద్ద లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసి అర్ధరాత్రి సెలవు రోజుల్లో ఆంధ్రాకు తరలించే వారి సంఖ్య ఎక్కువైంది. ఇంటింటికి తిరుగుతూ బియ్యం కేజీకి 10 కొనుగోలు చేసి 15వ తారీకు నుంచి లోడింగ్ చేసి ఆంధ్రకు సరిహద్దు ప్రాంతాలైన చిన్న కోరుకొండి, ముగ్గ వెంకటాపురం, ఎర్ర బంజర, ఎర్రబోయినపల్లి, వెన్నవల్లి సరిహద్దు గ్రామాల వెంబడి మామిడి తోటలలోలోడింగ్ చేసి తరలిస్తున్నారు. మండలంలో అధికంగా 15 మంది వ్యాపారులు అక్రమ దందా చేస్తూ డీలర్లకు అక్రమ వ్యాపారులకు మధ్య సంబంధాలు కొనసాగిస్తూ ప్రతి నెల ఐదో తారీకు నుంచి 15వ తేదీ వరకు ఈ లావాదేవీలు మండలంలో కొనసాగిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. అదే విధంగా అధికారులు తెలిసీ తెలియనట్లు పట్టినట్లు పర్యవేక్షణ లోపంతో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. కొందరు వ్యాపారులతో డీలర్లు కుమ్మక్కై అధిక లాభార్జన చేస్తూ లబ్ధిదారుల నుంచి కొందరు ఇంటింటికి తిరిగి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. మరి కొందరు డీలర్ల వద్దని అమ్ముకొని వెళ్తున్నారు. వారు వ్యాపారులకు అమ్ముతున్నట్లు చర్చలు కొనసాగుతున్నవి. మండలంలో బియ్యం అక్రమ దందా అడ్డదారుల్లో ఆంధ్రకు ఐదో తేదీ నుంచి 15వ తేదీ వరకు సెలవు దినాల్లో అర్ధరాత్రి తరలిస్తున్నట్లు చర్చలు కొనసాగుతున్నవి. దొరికితే 6 ఏ శిక్ష కేసు, దొరకనిచో దొర అన్నట్లు సూక్తి నడుస్తుంది.

# సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** సింగరేణి మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా జిఎం ఎం.షాలెం రాజు ఆదేశానుసారం కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.సుజాత సమక్షంలో కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి నందు ఆదివారం రెండు ప్రత్యేక వైద్య బృందంతో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన అంబేద్కర్‌నగర్, కిష్టారం, ఎన్‌టిఆర్ కాలనీ, చెరుకుపల్లి, రేజర్ల గ్రామాల్లో వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నిమిత్తమై ఏర్పాటుచేయడం జరిగింది. ఈ వైద్యశిబిరం నందు 239 మంది గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ వైద్యశిబిరం నందు ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు ఒక పిరియాడిషన్(పిల్లల డాక్టర్) కూడా పాల్గొని గ్రామస్థులకు వైద్యచికిత్సలను అందించారు. ఈ కార్యక్రమంలో జిఎం జివి కోటిరెడ్డి, కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి అడిషనల్ సిఎంవో డాక్టర్ ఎ.విక్టరీ వందనం, డాక్టర్స్ బృందం, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవి.నర్సింహారావు, జెవిఆర్ డిస్పెన్సరీ డాక్టర్ నర్సింహారావు, రేజర్ల పంచాయతీ సెక్రటరీ దీప్తి, సీనియర్ పివోలు కె.దేవదాస్, విజయ సందీప్, గ్రామస్థులు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎంను కలిసిన కాంగ్రెస్ బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు నాగరాజు





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ ప్రజాభవన్ నందు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కాంగ్రెస్ పార్టీ బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు ఆదివారం కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాగరాజు తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ ఛైర్మన్ బెల్లా నాయక్‌ను ఎస్టీ సెల్ ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా నాగరాజు కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.

## చంద్రుగొండ ఎస్ఐగా గంజి స్వప్న



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ ఎస్ఐగా జి స్వప్న ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని , పోలీసులకు ప్రతి యొక్కరు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహించే వారి వివరాలు తెలియజేయాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచటం జరుగుతుందన్నారు. ఎస్ఐగా బాధ్యతలను స్వీకరించి స్వప్నకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## గిరిజన దర్బారుకు అధికారులంతా హాజరుకావాలి




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏలో నేడు జరిగే గిరిజన దర్భారుకు అధికారులంతా సకాలంలో హాజరుకావాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఏ పరిధిలోని మారుమూల గిరిజన ప్రాంతాల నుండి గిరిజనులు తమ సమస్యలు తెలిపేందుకు ఐటిడిఏలో జరిగే గిరిజన దర్భారుకు వస్తుంటారని, వారి నుండి విన్నపాలు తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

## రామాలయ అర్చకుల బదిలీ ప్రక్రియ ఆపాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** రామాలయంలో అర్చకులబదిలీలకు నోటీసులు అందడంతో వాటిని నిలుపుదల చేయాలని కోరుతూ అర్చకులు ఎంఎల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ రామదాసు కాలంలో తమళనాడు నుండి అర్చకత్వం చేసేందుకు భద్రాచలం తీసుకొచ్చారని, ఆ నాటి నుండి నేటి వరుకు ఆ కుటుంబాల వారే అర్చన చేస్తున్నారని అన్నారు. పేర్కొన్నారు బదిలీల ప్రక్రియను ఆపాలని, దీనిపై ముఖ్యమంత్రిని కూడా కలుస్తామని అన్నరు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏకు షాలువా కప్పి సత్కరించిన అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

## 8 కేజీల కణితి తొలగింపు

**- ఆపరేషన్ చేసిన ఎంఎల్ఏ డా.తెల్లం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆ మహిళ కడుపులోని 8 కేజీల కనితిని స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు తొలగించారు. వివరాల ప్రకారం ఆలుబాక గ్రామానికి చెందిన సిహెచ్ కుమారి తీవ్రమైన కడుపునొప్పితో వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరిశీలించి నవైద్యుడు కడుపులో కనితి ఉందని, వెంటనే ఆపరేషన్ చేసి తొలగించకుంటే ప్రాణానికే ప్రమాదం అని సూచించారు. దీంతో ఆపరేషన్‌కు సిద్ధం చేసి కడుపులోని కనితి తొలగించారు. ప్రస్తుతం కుమారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు.

# ఉమ్మనీరు తాగి బేబీ మరణించింది..

**-నిర్లక్ష్యం రుజువైతే వైద్య సిబ్బంది పై చర్యలు**
**-సత్తుపల్లి డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో సీతారాం**



**ప్రజాపక్షం/తల్లాడ :** డెలివరీ సమయంలో బేబీ ఉమ్మనీరు తాగి మృతి చెందడం జరిగిందని సత్తుపల్లి డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో సీతారాం తెలిపారు. ఆదివారం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. శిశువు మరణించిన ఘటనపై వైద్య సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని విడి విడిగా విచారించారు. అనంతరం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ శిశు వు మృతి చెందడం బాధాకరమన్నారు. గతంలో లావణ్యకు ఈ ఆసుపత్రిలో మొదటి కాన్పు జరిగిందని తెలిపారు. ఆసుపత్రిపై ఉన్న నమ్మకంతో రెండవ కాన్పుకు లావణ్య శనివారం వచ్చిందన్నారు. లావణ్యకు ఉదయం 10 గంటలకు నొప్పులు రావడంతో ఆమెను వైద్య సిబ్బంది పరిశీలించి వాతం నొప్పులని గుర్తించి ఆమెను కూర్చోబెట్టడం, ఇతర ఆసనాలు చేయించడం జరిగిందన్నారు. రాత్రికి 7.30 గంటల సమయంలో లావణ్యకు డెలివరీ నొప్పులు ప్రారంభమయ్యాయని ప్రసవ సమయంలో బేబీ తల భాగం ఆలస్యం కావడం వల్ల ఉమ్మనీరు తాగి మృతి చెందడం జరిగిందని తెలిపారు. నొప్పులు ప్రారంభంకు ముందు ఖమ్మంకు పంపిస్తే తల్లీ బిడ్డ క్షేమంగా ఉండేవారని ఆయన తెలిపారు. లావణ్యను కాపాడేందుకు ఖమ్మం ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలితే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లాడ ప్రభుత్వ ఆసుపత్రికి, ఇక్కడ పనిచేసే సిబ్బందికి మంచి పేరు ఉందని సంవత్సరానికి 100 ప్రసవాలు చేస్తున్నారని ప్రతి నెల 10 నుంచి 12 సాధారణ ప్రసవాలు చేస్తున్నారన్నారు. బేబీ మరణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

**అభిషేక్ ఆరోగ్య పరిస్థితి బాగా లేదు : స్టాఫ్ నర్సు కళావతి**

శిశువు మృతికి సంబంధించి స్టాఫ్ నర్సు కళావతిని వివరణ కోరగా తాను ఎలాంటి తప్పు చేయలేదని సెల్ ఫోన్‌లో రీల్స్ చేయలేదని తెలిపారు. లావణ్యకు డెలివరీ కోసం ప్రయత్నం చేసినట్లు ఉమ్మనీరు తాగడం వల్లే బేబీ మృతి చెందడం జరిగిందన్నారు. కుర్చీలో తన కుమారుడు కూర్చోవడం గురించి మాట్లాడుతూ 15 ఏళ్లుగా తన కుమారుడు జాన్ అభిషేక్ ఆరోగ్య పరిస్థితి బాగా లేదని తెలిపారు. అతని పరిస్థితి బాగా లేకనే తన వెంట తీసుకు వచ్చినట్లు తెలిపారు. తెలియక అభిషేక్ కుర్చీలో కూర్చోవడం జరిగిందని అతని మానసిక పరిస్థితి బాగా లేదని వైద్యులు అందిస్తున్న చికిత్సలకు సంబంధించి రిపోర్టులు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ



**ఒకరు పట్టుబడగా..ముగ్గురు పరారీలో ఉన్నారు...**

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** చోరీ చేసి చాకచాక్యంగా తప్పించుకుందామని అనుకున్నారు. స్థానికులకు చిక్కారు...నలుగురులో ముగ్గురు పరారు కాగా, ఓ మైనర్ దొంగ స్థానికులకు చిక్కాడు. పూర్తి వివరాల్లోకి వెళితే....ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం గుర్తు తెలియని దుండగులు చోరీ కి పాల్పడ్డారు. భక్తుల మాదిరిగా వచ్చి రెక్కీ నిర్వహించారు. భక్తులు అంతా వెళ్లిన తరువాత దొంగలు గా మారారు. దేవాలయం వెనక నుంచి వచ్చి తలుపులు పగలగొట్టి అందులో ఉన్న నిత్య పూజలకు ఉపయోగించే వెండి వస్తువులు చోరీ చేశారు. దేవాలయం నుంచి బయటకు రాగానే అదే గ్రామానికి చెందిన నాని, ఉపేందర్ అనే స్తానికులు వీరి పట్ల అనుమానం కలిగింది. ప్రశ్నిస్తే తడబడ్డారు. అంతే వాహానంను తనిఖీ చేయగా...అందులో దేవాలయం కు చెందిన వెండి వస్తువులు కనిపించాయి. స్తానికులు ఇరువురు వారిని నిలదీస్తుండుగా అక్కడే వస్తువులు వదిలి పారిపోయే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు స్తానికులు ఒక మైనర్ దొంగ ను పట్టుకున్నారు. చోరీ ఘటన తెలుసుకుని నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు దేవాలయం కు వచ్చారు. వివరాలు సేకరించారు. మైనర్ దొంగ ను అదుపులోకి తీసుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగ ఇచ్చిన వివరాలు ఆధారంగా మిగతా ముగ్గురు కోసం ప్రత్యేకంగా వెళ్లారు.

# వృద్ధుల పెన్షన్ తిరిగి చెల్లించాలనే ఉత్తర్వులను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** కొత్తగూడెం మున్సిపాలిటీ వ్యాప్తంగా 42మందికి ఇతర పెన్షన్ పొందుతూ 2017 నుండి ఆసరా పెన్షన్ పొందిన వృద్ధులు, వితంతవులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆసరా పెన్షన్ రూ.2వేలను వారు వాడుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, వృద్ధులపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను పునరాలోచింపజేసి ఆ ఉత్తర్వులను రద్దుపరచుకోవాలని పదో వార్డు కౌన్సిలర్ పద్మ ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృద్ధాప్య, వితంతు పెన్షన్‌లు కొంతమంది వృద్ధులు, వితంతువులు ఒక పెన్షన్ నుండి రెండో ఆసరా పెన్షన్ పొందుతున్న వారు ఇప్పటివరకు వారు వాడుకున్న రూ.172900లు పైచిలుకు సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఇచ్చిన ఉత్వర్వులతో వృద్ధులు, వితంతువులు మానసిక ఆదోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు వారి కుటుంబ అవసరాల రీత్యా బిపి, షుగర్ తదితర జబ్బులకు వచ్చిన రూ.2వేలు ఖర్చు చేసుకున్నారని తిరిగి అలాంటి పేద, మధ్యతరగతి వారు డబ్బులు చెల్లించమంటే ఎలా చెల్లిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కొంతమంది రెండో పెన్షన్ వద్దని స్వచ్ఛందంగానే గత కొన్ని నెలల నుండి పెన్షన్ తీసుకోవడం మానేశారని, కాని వారు ఇప్పుడు గతంలో వాడుకున్న సొమ్ము మొత్తం తిరిగి చెల్లించాలని ఉత్తర్వులు అందించడంతో వారు ఆందోళన చెందుతున్నారని ఆమె పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర, జిల్లా అధికారులు ఇచ్చిన ఉత్తర్వులపై పునరాలోచింపజేసి ఉత్తర్వులను రద్దు చేసి వృద్ధులను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పిండిప్రోలు కేంద్రంగా అక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగుతుంది పిండిప్రోలు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నిలువ చేసిన పిడిఎస్ బియ్యం స్థావరం పై విశ్వసనీయ సమాచారం మేరకు తిరుమలాయపాలెం తహశీల్దార్ పివి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు చేసి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పిండిప్రోలు గౌతమి స్కూల్ సమీపంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం సమీపంలో 20 బస్తాల పిడిఎస్ బియ్యాన్ని నల్ల రంగు పట్టా కప్పి నిలువ ఉంచారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పివి రామకృష్ణ పోలీసుల సాయంతో నిలువ ఉంచిన బియ్యాన్ని పరిశీలించగా ఆ పిడిఎస్ బియ్యం వానకు తడిసి ముక్క వాసనతో కూడిన దుర్గంధం వెదజల్లుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులవిగా భావించి బియ్యం ఇతరులు వినియోగించకుండా పంచనామా నిర్వహించి స్థానిక రేషన్ డీలర్ బి.సుందర్ రావు కి అప్పగించారు. వీటిని ఊరు అవతల స్మశాన వాటిక దగ్గర జేసిబి సాయంతో గుంట తీసి వాటిలో వేసి మరలా పూడ్చి వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, పోలీస్ సిబ్బంది హరికృష్ణ, డీలర్ సుందర్ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజలందరికి కృతజ్ఞతలు

**పాత్రికేయుల సమావేశంలో ఎంపి రఘురాంరెడ్డి**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి రాష్ట్ర మంత్రి పొంగులేటి కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్తగూడెం నియోజకవర్గంలో 75వేల మెజారిటీని అందించిన నియోజకవర్గ ప్రజలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఖమ్మం జిల్లా చరిత్రలోనే అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలిపించినందుకు ధన్యవాదాలు, శక్తివంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడామని తెలిపారు. ఈ కార్యక్రమలో జెడ్పీ చైర్మన్ కంచర్లచంద్రశేఖర్‌రావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, జిల్లా మహిళా కాంగ్రేస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, ఆళ్ళ మురళి, నాగేంద్ర త్రివేది, గోపాలరావు, కోనేరు సత్యనారాయణరెడ్డి,బాలప్రసాద్, సుందర్‌లాల్ కోరి, ఆకునూరి, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, మసూద్, రావి రాంబాబు, ఐఎన్‌టియుసి నాయకులుఎండి.రాజాక్, పితాంబరం, సోమిరెడ్డి, విప్లవరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గోటి తలంబ్రాల వడ్లకు పూజలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** వచ్చే ఏడాది జరిగే శ్రీరామ నమవికి స్వామికి సమర్పించే గోటి తలంబ్రాల వడ్లకు ఆదివారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన భక్తులు రామదాసు తిరుపతయ్య, తిరుపతమ్మ దంపతులు ఈ వడ్లను ఆలాయనికి పలువురితో కలిసి తీసుకొచ్చారు. వాటిని ఆర్చకులకు ఇచ్చి స్వామిపాదల చెంత ఉంచి పూజలు చేయించారు. ఈ సందర్భంగా వడ్లకు పూజలు చేసిన అర్చకులు వాటిని అందించే క్రమంలోశ్రీరామ అనే అక్షరాలు రాసి అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాలయం అర్చకులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐ ఆత్మహత్య కేసుతో సంబంధం ఉన్నవారిని విధుల నుండి తొలగించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** అశ్వారావుపేటలో విధులు నిర్వహిస్తున్న ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు కేసులో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరినీ విధుల నుండి తొలగించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పాల్ రాజ్ అన్నారు. స్థానిక ఎంపి కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా నేటికీ దళితుల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. దళితులు, దళిత ఉద్యోగులు నేటికీ అవమానాలకు గురవుతూనే ఉన్నారని, అశ్వరావుపేటలో నిబంధతతో పనిచేస్తున్న ఎస్ఐకి మంచిపేరు వస్తుంటే ఓర్వలేక పోయారని, ఆదిపత్య, అహంభావంతో ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు కారుకులైన సిఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లను వెంటనే విధుల నుంధ తప్పించాలని, అప్పుడు ఎస్ఐ ఆత్మకు శాంతి చేకూరుతుందని చెప్పారు. అంతే కాకుండా శ్రీరాములు శ్రీనివాసరావు సతీమణికి గ్రూప్ స్థాయి ఉద్యోగాన్ని ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పుట్టి రవి, అల్లాడి దుర్గారావు, బర్ల రామకృష్ణ, మోరంపల్లి రా ంబాబు, వీరబాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ కళ్యాణ పరిషత్‌కు భూ వితరణ



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ కళ్యాణ పరిషత్‌కు జవ్వాది కుటుంబ సభ్యులు 10 సెంట్ల భూమిని వితరణగా అందజేశారు. చర్లకు చెందిన జవ్వాది కోదండ రాంబాబు, సుమతి రామ్ దంపతులు 30 లక్షల విలువ చేసే చర్ల మండల కేంద్రంలో ఇచ్చారు. గత 20 సం.లుగా చర్లలో వనవాసీ సంస్థను ఏర్పాటు చేసి కొమరం భీమ్ విద్యార్థి నిలయం ద్వారా వందల మందికి ఆదివాసీ విద్యార్థులకు వసతి కల్పించారు. సంస్థ సేవలకు ముగ్ధులైన దంపతులు తాము పుట్టిన జన్మభూమిని రుణం తీర్చుకునేందుకు ఈ భూమిని వితరణగా ఇవ్వాలని తలంచి అందజేశారు.

# సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను ములకలపల్లి మండలానికి అందించాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను ములకలపల్లి మండలానికి అందించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కే కుమార్, ములకలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కుంజ కృష్ణలు అన్నారు. ఆదివారం సిపిఐ ఎంఎల్‌పి న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గుట్టగూడెంలో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పక్కనే ఉన్న గోదావరి జలాలను ఈ మండలానికి ఇవ్వకుండా ఖమ్మం జిల్లా పాలేరు, వైరా రిజర్వాయర్లకు తీసుకెళ్లడం సరైందని కాదన్నారు. గోదావరికి దగ్గరలో ఉన్న ములకలపల్లి మండలానికి సాగునీరు అందించిన తర్వాత ఖమ్మం జిల్లాలకు నీళ్లు తీసుకుపోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, చింతల వెంకటేశ్వర్లు, సురేష్, దొబ్బ వెంకటేశ్వర్లు, కొర్రి వీరస్వామి, దుబ్బ రవి, కడియం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.